సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 19 | డిసెంబర్ | 2023



ఫోన్ పోయిందంటే..

మొబైల్ ఫోన్ పోయిందంటే చాలు.. యూపీఐ వ్యాలెట్ల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు మాయం చేస్తున్నారు.

- 8లో ▸



ప్రజా పరిపాలన అందిస్తా..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$28^0/14^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు బావుపేట రైల్వే గేట్ మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య బావుపేట రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్-9ను మంగళవారం మూసివేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేట్ సమీపంలో మూడవ రైల్వే లైన్ పనులు చేపడుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రత్యామ్నాయంగా సీతంపేట వైపు ఉన్న రైల్వేగేట్ నంబర్-11 నుంచి ప్రజలు, వాహనదారులు వెళ్లాలని సూచించారు.

జనవరి 31 వరకు ఈ-కేవైసీ చేసుకోవాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని రేషన్ కార్డుదారులు జనవరి 31వ తేదీలోగా రేషన్ షాపు డీలర్ల వద్ద వేలి ముద్రలు(ఈ-కేవైసీ) వేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి పి.వసంతలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా రేషన్ కార్డుదారులంతా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫుల్‌టైం మెడికల్ ఆఫీసర్(మేల్) నియామకానికి ఎంబీబీఎస్ అర్హత, మంచి వ్యక్తిత్వం, సేవాదృక్పథం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈమేరకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు బయోడేటా, సర్టిఫికెట్ల ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహించే తేదీని తరువాత ప్రకటిస్తామన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి, విశ్రాంత ఉద్యోగులకు, విద్యార్థులకు వైద్య సేవలు అందించాల్సి ఉంటుందని, నెలకు రూ.35,000 చొప్పున వేతనం నోటిఫికేషన్‌లో వివరించారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



హన్మకొండ అర్బన్ : హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని రాంనగర్ బీసీ వెల్ఫేర్, బాలసముద్రంలోని సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, జులైవాడలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెలకొన్న సమస్యలపై విద్యార్థులు, సంక్షేమ అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ బ్లాంకెట్లు ఉన్నాయా.. వేడి నీళ్లు అందిస్తున్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో బీసీ, ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ డీడీలు జి.రాజిరెడ్డి, పరుశురాములు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ కల్యాణి



కమలాపూర్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఇలాంటి పరీక్షలను ప్రోత్సహించవద్దని మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కల్యాణి అన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా సోమవారం అంబాల ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా జన్మోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ రోజురోజుకూ ఆడపిల్లల శాతం తగ్గిపోతున్నదని, ఇందుకు గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలే కారణమని, వీటిని అరికట్టి ఆడ పిల్లల రేషియో పెంచాలన్నారు. అనంతరం పీసీపీఎన్‌డీటీ చట్టం, లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీటీసీ గుర్రం వెంకటేశ్వర్లు, ఎంపీఓ విమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, వార్డు సభ్యుడు నాగేశ్వర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పార్లమెంట్‌పై కాంగ్రెస్ గురి..!





లోక్‌సభ ఇన్‌చార్జ్‌ల నియామకం

- వరంగల్‌కు కొండా సురేఖ.. మహబూబాబాద్‌కు 'పొంగులేటి'..
- మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ బాధ్యతలు
- క్యాడర్‌తో సమన్వయానికి మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు
- ఆ రెండు ఎంపీ స్థానాలకు పోటాపోటీగా ఆశావహులు

పీఏసీలో ఓరుగల్లు ప్రస్తావన..

వరంగల్, మహబూబాబాద్.. పార్లమెంట్ స్థానాలను గెలవడం కాంగ్రెస్ టార్గెట్‌గా పెట్టుకుంది. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఉమ్మడి వరంగల్ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇదే అంశాన్ని సూచించడం గమనార్హం. 12 స్థానాలకు 10 అసెంబ్లీ సీట్లను గెలిచామన్న భావనతో పార్లమెంట్ ఎన్నికలను నిర్లక్ష్యం చేయరాదని ఈ కమిటీలో సూచించినట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్ పార్టీ 131 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న నాగ్‌పూర్‌లో జరిగే వేడుకలకు వరంగల్, మహబూబాబాద్ నుంచి పదివేలకు తగ్గకుండా మందిని రైలుమార్గంలో తరలించాలన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికలకంటే ముందుగానే అసెంబ్లీ టికెట్లను వదులుకున్న వారిని నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేయాలని, అందుకు సంబంధించిన ఉమ్మడి జిల్లా జాబితా కూడా సిద్ధం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రతీ కార్యకర్త అసెంబ్లీ ఎన్నికల్లో చూపిన పట్టుదల, తెగువ, కృషి.. పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపుగా చూపాలని సూచించింది.

సాక్షిప్రతినిధి, వరంగల్ :

పార్లమెంట్ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ గురి పెట్టింది. శాసనసభ ఎన్నికల్లో వరించిన విజయంతో అధికార పగ్గాలు చేజిక్కించుకున్న ఆ పార్టీ దూకుడుగా ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి వరంగల్‌పై వేగంగా పావులు కదుపుతోంది. 12 అసెంబ్లీ స్థానాలకు పదింటిలో గెలిచిన కాంగ్రెస్ వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవాలని కుతూహలపడుతోంది. అందులో భాగంగానే తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించిన ఆ పార్టీ అధిష్టానం వరంగల్, మహబూబాబాద్‌లకు సైతం నియమించింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్‌కు ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ధనసరి సీతక్కను ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ లోక్‌సభ స్థానం పరిధిలోని ఉమ్మడి వరంగల్ నియోజకవర్గాలు, మండలాల నేతలతో సమన్వయం చేయనున్నారు.

పోటాపోటీగా ఆశావహులు

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల మద్దతు కూడగడుతున్నారు. మాజీ ఎంపీలు, సీనియర్లు, టీపీసీసీ, ఏఐసీసీ నేతలను సంప్రదిస్తున్నారు. వరంగల్ నుంచి దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ ప్రయత్నం చేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శనిగపురం ఇందిర పేరు కూడా వినిపిస్తున్నది. మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, నెహ్రూనాయక్, బెల్లయ్య నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నలుగురు సీనియర్లు కూడా వరంగల్, మహబూబాబాద్ కాంగ్రెస్ టికెట్ల కోసం లోపాయికారిగా మాట్లాడుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో 17 స్థానాల్లో దాదాపు 15-16 స్థానాలు కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం వరంగల్, మహబూబాబాద్ ఎంపీలను గెలిపించుకోవడానికి ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన క్రిస్మస్ పండుగ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి వెయ్యి దుస్తులు పంపిణీతో పాటు ఫీస్ట్ నిర్వహణకు రూ.2 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాసరావు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు ఎల్.రమేష్, శ్రీనివాస్, ఏసీపీ కిరణ్‌కుమార్, పాస్టర్లు ఐజాక్, మందకుమార్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సేవాదృక్పథం అలవర్చుకోవాలి

కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ



శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కోఆర్డినేటర్ నారాయణ, వలంటీర్లు

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటు సేవాదృక్పథం అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అన్నారు. కేయూ ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలతో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని అన్నారు. అంతకు ముందు క్యాంపస్‌లోని ఆడిటోరియం ప్రాంతంలో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, డీన్ ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్లు కృష్ణవేణి, స్వరూపరాణి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ సునీత, డాక్టర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న గంగు ఉపేంద్రశర్మ



వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి, వరంగల్‌లోని శ్రీభద్రకాళి దేవాలయంలో మార్గశిర శుద్ధషష్టి సోమవారం సుబ్రహ్మణ్యషష్ఠిని పురస్కరించుకుని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, భద్రకాళిశేషు ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవవిగ్రహాలను ప్రతిష్ఠించి అభిషేకాలు చేసిన అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. భద్రకాళి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

'అభివృద్ధి' ప్రణాళికలు సమర్పించాలి

- బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలో 2014 నుంచి ఇప్పటి వరకు అభివృద్ధి పనులు, నిధులకు సంబంధించిన ప్రణాళికలు సమర్పించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ఈ మేరకు సోమవారం గ్రేటర్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు దఫాల్లోని ప్రభుత్వాల హయాంలో పూర్తయిన, పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు, మంజూరైన, పెండింగ్ నిధులపై వివరాలు సమర్పించాలన్నారు. ప్రారంభించని అభివృద్ధి పనులను నిలిపివేయాలని సూచించారు. సీఎం, స్మార్ట్‌సిటీ, అమృత్, పట్టణ ప్రగతి, ఆర్థిక సంఘాలు తదితర నిధుల వివరాలు ఇవ్వాలని చెప్పారు. గ్రీవెన్స్, విభాగాల వారీగా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ, పెండింగ్‌పై సమీక్షించిన ఆయన వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. పన్నుల వసూళ్లు పెంచడానికి ప్రత్యేక అధికారులను నియమిస్తామని, నీటి సరఫరా తీరుపై ఏఈల వారీగా వారి పరిధిలోని కనెక్షన్లు, అత్యధికంగా బకాయి ఉన్న 100 మంది చెల్లింపుదారుల సమాచారంతో త్వరలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలన్నారు. ఈనెల మూడో శనివారంలోగా పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్ దరఖాస్తులు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, టీపీఆర్ఓ రాజేష్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపునకు పేటీఎం స్వైప్ మిషన్లు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌కు చెందిన ఈ-సేవా కేంద్రాల్లో పేటీఎం స్వైప్ మిషన్లను త్వరలో అందుబాటులోకి తేవాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం హన్మకొండలోని నక్కలగుట్ట, అశోకా థియేటర్, నయీంనగర్ ఈ-సేవా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పన్నుల వసూళ్ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ-సేవా కేంద్రాల్లో ఆస్తి, నీటి, చెత్త, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల చెల్లింపునకు అత్యాధునిక సాంకేతి పరిజ్ఞానాన్ని పటిష్టపర్చాలన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న 9 ఈ-సేవా కేంద్రాల్లో రెండేసీ పేటీఎం స్వైప్ మిషన్లను యుద్ధప్రతిపాదిక కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా చెప్పారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య
- గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై వచ్చిన అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్/సాక్షి, వరంగల్ : గ్రీవెన్స్‌లో వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయా కలెక్టరేట్ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను వారు స్వీకరించారు. హనుమకొండ గ్రీవెన్స్‌కు 95, వరంగల్ గ్రీవెన్స్‌కు 65 వినతులు వచ్చాయి.

ఆక్రమణ నుంచి కాపాడాలి



వారసత్వంగా వచ్చిన ఇంటిని గ్రామానికి చెందిన పలువురు నకిలీ దస్తావేజులు సృష్టించి తప్పుడు రిజిష్టర్ దస్తావేజుల ద్వారా ఆక్రమణకు సిద్ధమయ్యారు. ఆక్రమణదారులైన పున్నం ఆగమ్మ, బోనగిరి అయిలయ్యపై చర్య తీసుకుని ఇంటిని రక్షించాలి.

- గుడికందుల సమ్మయ్య, సీతంపేట(హసన్‌పర్తి)

పింఛన్ జారీ చేయాలని వినతి



నా వయసు 80 సంవత్సరాలు. వికలాంగుడిగా సదరం సర్టిఫికేట్ ఉంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ వచ్చేది. బీఆర్ఎస్ ప్రభుత్వం పింఛన్ నిలిపి వేసింది. తిరిగి వచ్చేలా చూడాలి.

- సిలివేరు రాజవీరయ్య, కొండపర్తి(ఐనవోలు)

పరిహారం అందించాలి



వరంగల్ ఇన్నర్ రింగురోడ్‌లో భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లింపుల కోసం నోటిఫికేషన్ జారీ చేసి ఆర్నెళ్లు దాటింది. అయినా పరిహారం అందలేదు. ఎన్నికల అనంతరం చెల్లిస్తామని అధికారులు అన్నారు. ఎన్నికలు ముగిశాయి. నష్ట పరిహారం చెల్లించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- బిల్ల రమేశ్, ఇన్నర్ రింగురోడ్ బాధితుడు

ధరణిలో పేరు మారడం లేదు



మా తండ్రికి భూమిని నాతో పాటు ముగ్గురు అన్నదమ్ములం కలసి పంచుకున్నాం. 2012లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. ధరణి పోర్టల్‌లో వెంకట్రాజం, నర్సింహారెడ్డి పేరు వస్తోంది. మూడేళ్లుగా తహసీల్దార్, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ధరణిలో పేరెక్కించాలి.

- సుంకరి స్వరూప, ఖిలావరంగల్

బ్యాక్‌లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి



ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం 2018లో నోటిఫికేషన్ ఇచ్చారు. ఐదేళ్లయినా మళ్లీ ఇవ్వలేదు. వెంటనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

- యదల లక్ష్మి, వరంగల్

సదరం సర్టిఫికెట్, పింఛన్ ఇప్పించాలి



నేను ఎస్టీ తెగకు చెందిన మరుగుజ్జు దివ్యాంగురాలినైనప్పటికీ ఎలాంటి పింఛన్ రావట్లేదు. సదరం క్యాంపునకు వెళ్లినా పట్టించుకోవడం లేదు. సర్టిఫికెట్‌తో పాటు పింఛన్ మంజూరు చేయాలి.

- ముదు శైల, ఏకేతండా, రాయపర్తి మండలం

సీలింగ్ ల్యాండ్ కబ్జాపై ఫిర్యాదు



కాజీపేట మండలం మడికొండలోని 1844/అ సర్వే నంబర్‌లోని సీలింగ్ భూమి కబ్జాపై మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో సీలింగ్ భూమిగా నమోదైందని, అయితే గత అధికార పార్టీ నాయకులు వారి పేరుపై, బినామిల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

- మడికొండ

555 ఆర్టీపీసీఆర్ టెస్టులు


- పాజిటివ్ కేసులు జీరో
- కేరళలో కరోనా కొత్త సబ్ వేరియంట్!
- కేంద్రం అప్రమత్తం



సాక్షి, వరంగల్: జిల్లాలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. నవంబర్‌లో జిల్లా వ్యాప్తంగా 405 ఆర్టీపీసీఆర్ టెస్టులు చేస్తే ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. డిసెంబర్‌లోనూ 150 ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసినా పాజిటివ్ కేసు నమోదు కాలేదు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడూ కరోనా మహమ్మారి విషయంలో అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆర్టీపీసీఆర్ టెస్టులకు ముందుకు వస్తే చేస్తోంది. నవంబర్, డిసెంబర్‌లోనూ ఆ పరీక్షలు చేయడం ఇందుకు బలం చేకూరుస్తోంది. కరోనా వైరస్ కొత్త సబ్ వేరియంట్ జేఎన్ 1 కేసులు కేరళలో నమోదవ్వడంతో కేంద్రం ఇప్పుడు అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఆర్టీపీసీఆర్ టెస్టులు ఎక్కువ చేయాలని, వేరియంట్ తెలుసుకునేందుకు జీనోమ్ సీక్వెన్స్ టెస్టులు చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ సూచించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే ఆర్టీపీసీఆర్ టెస్టులు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా పాజిటివ్ కేసు నమోదు కాకపోవడంతో జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ కరోనా వ్యాప్తి సమయంలో పాటించినట్లు జాగ్రత్తలు పాటిస్తే మహమ్మారి వచ్చే చాన్స్ ఉండదని జిల్లా వైద్య విభాగాధికారులు చెబుతున్నారు.

ఇంటి దొంగలతోనే ప్రమాదం ఎక్కువ

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: ఇంటి దొంగలతోనే ప్రమాదం ఎక్కువ.. శత్రువులు ఏ పార్టీలో ఉన్నా తెలుసుకోవడం చాలా సులభమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ధర్మసాగర్, వేలేరు మండలాల బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మనతోనే ఉంటూ, మనతోనే తిరుగుతూ ఎన్నికల్లో మనకే మోసం చేశారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు మన మీద ఎన్నో ఆశలు ఉన్నాయని, వారి నమ్మకానికి అనుగుణంగా పని చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాల విషయంలో ఏ రకంగా ముందుకు పోతున్నదో స్పష్టత రాలేదని, బహుశా రాష్ట్ర ఆదాయ వనరులను తెలుసుకున్న తర్వాత సంక్షేమ పథకాల విషయాలపై స్పష్టత వస్తుంది కావచ్చునని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన అన్ని విషయాలకు కట్టుబడి ఉంటుందని అనుకుంటున్నామని, అయితే వారు చెప్పిన 100 రోజుల వరకు వేచి చూద్దామని అన్నారు. సమావేశంలో కడియం ఫౌండేషన్ చైర్మన్ కడియం కావ్య, డీసీసీబీ డైరెక్టర్ గున్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీలు చాడ సరిత, పిట్టల శ్రీలత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మునిగెల రాజు, కాయిత మాధవరెడ్డి, ధర్మసాగర్ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, బొడ్డు ప్రభుదాస్, గుజ్జుల రాంగోపాల్‌రెడ్డి, బిల్లా యాదగిరి, జుబాదాలాల్ తదితరులు పాల్గొన్నారు.

కేయూకు మొదటి స్థానం

కేయూ క్యాంపస్: ఇండోనేషియా జకర్తాలోని యూఐగ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్(2023)లో కాకతీయ యూనివర్సిటీ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు సోమవారం తెలిపారు. దేశంలో 29వ స్థానం, ప్రపంచంలో 600ల స్థానం కైవసం చేసుకుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్ యూఐగ్రీన్ మెట్రిక్ చైర్‌పర్సన్ నుంచి మేయిల్ ద్వారా కేయూకు సమాచారం అందిందని పేర్కొన్నారు. పర్యావరణ, సుస్థిరత, బాధ్యతాయుతమైన క్యాంపస్ నిర్వహణపై దృష్టిసారించి చేసిన ప్రయత్నాలకు ఇది నిదర్శనమన్నారు. హరిత కార్యక్రమాలు, స్థిరమైన అభ్యాసాలను ప్రోత్సహించటంలో ముందున్నట్లు వివరించారు. ఈ ర్యాంకింగ్ రావటంపై కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేయూ న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించిందని, తాజాగా యూఐమెట్రిక్స్ ర్యాంకింగ్ కూడా వచ్చిందని, యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేయడానికి అందరి సహకారంతో ముందుకెళ్తామన్నారు.

క్లుప్తంగా

కవితాపఠనంలో మంజుల రికార్డు



మంజులను సన్మానిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈనెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాల్లో హనుమకొండ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన సాగంటి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, కవయిత్రి, ఎల్‌బీ కళాశాల అధ్యాపకురాలు సాగంటి మంజుల ప్రపంచ రికార్డు సాధించారు. ఈ పోటీల్లో మంజుల 33 గంటలు ఏకధాటిగా కవితాపఠనం వినిపించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తి మండప్రతాప్, కన్వీనర్ రమావతి.. మంజులకు ప్రశంస పత్రం, మెమెంటో అందజేసి సన్మానించారు. కాగా, ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. మంజులను తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



చంద్రశేఖర్ మృతదేహం

వేలేరు: విద్యుదాఘాతంతో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లికుదుర్లలో జరిగింది. ఎస్సై హరిత కథనం ప్రకారం గ్రామానికి చెందిన బస్సు చంద్రయ్య ఇంటివద్ద యూపీకి చెందిన చంద్రశేఖర్ నిషాద్(32) ఆదివారం మధ్యాహ్నం కబోర్డు వర్క్ చేస్తున్నాడు. కర్టెన్ రాడ్ బాల్కానీ పై ఉన్న 11 కేవీ లైన్‌కు తగలడంతో కరెంట్ సరాఫరా అయింది. ఇది గమనించని చంద్రశేఖర్ రాడ్‌ను కిందికి తీస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి అపస్మరకస్థితికి చేరుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత సోమవారం తెలిపారు.




పంట పరిరక్షణకు..

నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



వర్ధన్నపేటలో యాసంగికి సిద్ధమవుతున్న నారు



- మెళకువలతో అధిక దిగుబడి
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

వర్ధన్నపేట: ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైంది. దీంతో అన్నదాతలు దుక్కులు దున్నుతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి రాంనర్సయ్య వివరించారు.

విత్తన శుద్ధి

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటకు పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించవు. కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండైజిమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, మువ్వ పురుగు ఆశించకుండా ఉంటుంది.

నారుమడి తయారీ విధానం

నారు పోయాల్సిన మడిని దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పారించడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. ఎకర పొలం నాటడానికి అరగుంట భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి. అరగుంట నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

నారులో కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 మిలీ, ఒక లీటర్ నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు సైహాలోపాస్ బ్యూలైట్ 10 శాతం మందును 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన పది రోజులకు కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు అరగుంట నారుమడికి 150 గ్రాముల చొప్పున చల్లాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ ఫాస్పేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు 20.25 రోజుల వయసు ఉన్నప్పుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసే విధానం

నారు ఆకు లేతగా ఉంటేనే చేను తొందరగా తిరుగబెడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు వాడితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 44 నారు మొలకలు ఉండేలా నాటుకోవాలి.

చలి నుంచి నారుమడికి రక్షణ చర్యలు..

చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతో పాటు అందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- సాయంత్రం వేళలో నీరు తీసి పగటి పూట వెచ్చటి నీరు పారించాలి.
- రోజు సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు చెక్కలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ప్రజా పరిపాలన అందిస్తా..



ప్రశాద్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

- ప్రశాద్ ప్రాజెక్టు పనులు నాణ్యతతో చేపట్టాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలు తనకు తెలుసు.. వాటి పరిష్కారానికి చొరవ తీసుకుని ప్రజా పరిపాలన అందిస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సోమవారం రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఆమెకు ఆలయ ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మంత్రిని అర్చకులు సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం ఆమె ఆలయ తూర్పు ముఖద్వారం వైపున రూ.62 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రశాద్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీఓ అంకిత్ ఆధ్వర్యంలో టీఎస్‌టీడీసీ ఈఈ విజయ్‌కు మార్ మ్యాప్ ద్వారా సీతక్కకు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పర్యాటకుల సౌకర్యార్థం చేపడుతున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను జూన్‌లోగా నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానని, రామప్ప ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని తెలిపారు. మంత్రి రామప్ప నుంచి ములుగు వెళ్లే క్రమంలో మైనార్టీ హాస్టల్ విద్యార్థులు లక్ష్మీపురం వద్ద సీతక్కను కలిసేందుకు రోడ్డుపై నిలబడగా వాహనం దిగి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారు మంత్రితో సెల్ఫీలు దిగి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీతక్క కుమారుడు ధనసరి సూర్య, పీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు చెన్నోజు సుర్యనారాయణ, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, జంగిలి రవి, చింతనిప్పుల భిక్షపతి, మహిపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మామిడిశెట్టి ధర్మతేజ, చెన్నోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫోన్ పోయిందంటే.. డబ్బులు మాయం

- యూపీఐ వ్యాలెట్ల నుంచి నగదు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు
- సిమ్ వేసుకుని బ్యాలెన్స్ చూసేసరికి డబ్బులు గోవిందా

కాజీపేట: మొబైల్ ఫోన్ పోయిందంటే చాలు.. యూపీఐ వ్యాలెట్ల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు కాజేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కాజీపేటకు చెందిన ఓ రైల్వే ఉద్యోగి ఫోన్ ఇటీవల చోరీకి గురైంది. మరుసటి రోజు కొత్తఫోన్ తీసుకుని పాత నంబర్‌తో ఉండే సిమ్ వేసి చూశాక బ్యాంకు ఖాతాలోని దాదాపు రూ.95వేలు మాయమయ్యాయి. దీనిపై లావాదేవీలు చూడగా యూపీఐ వ్యాలెట్ ద్వారా డబ్బు బదలాయించుకున్నట్లు తేలింది. ఖరీదైన స్మార్ట్ ఫోన్లు పోతే ఇలా కొత్త సమస్య వచ్చి పడినట్లేనని బహిర్గతమైంది. గూగుల్, ఫోన్‌పే నుంచి డబ్బు మాయం చేస్తున్నారు. బ్యాంకు ఖాతా నంబర్, యూపీఐ రహస్య కోడ్ వంటివి ఫోన్‌లో కాంటాక్టు లిస్టు ఇతర రూపాల్లో భద్రపరచుకున్న వారే ఎక్కువగా ఇలాంటి మోసాల బారిన పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

కొట్టేసిన డబ్బులతో షాపింగ్..

సాధారణంగా ఫోన్లు పోయి కొత్తది కొని పాత నంబర్ యాక్టివేషన్ చేయించేలోపు సైబర్ నేరస్తులు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఎక్కువ మంది బ్యాంకు ఖాతా నంబర్, యూపీఐ పిన్ వంటివి కాంటాక్టు లిస్టులో సేవ్ చేసుకోవడంతో నేరగాళ్ల పని మరింత సులువవుతుంది. మరికొందరు యూపీఐ కోడ్‌గా వరుస నంబర్లు, పుట్టిన సంవత్సరం, వాహన రిజిస్ట్రేషన్ నంబర్లు పెట్టుకుంటున్నారు. దీంతో సులువుగా ఛేదించి డబ్బు ఇతర ఖాతాలకు బదలాయించుకుంటున్నారు. కొందరు పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్‌లో స్కాన్ చేస్తున్నారు. ఫోన్లు కొట్టేశాక సైబర్ నేరగాళ్లు సిమ్ కార్డులతోనూ డబ్బు కొట్టేస్తున్నారు. కొట్టేసిన ఫోన్ నంబర్ ఏ బ్యాంకు ఖాతాతో లింకు అయిందో తెలుసుకుని ఫోన్లో దాచుకున్న బ్యాంకు ఖాతా, యూజర్ ఐడీ సేకరించి తేలికగా డబ్బులు కొటేస్తున్నారు.

బ్లాక్ చేయండిలా..

- గూగుల్ పే వినియోగదారులు 18004190157 ద్వారా బ్లాక్ చేయాలి.
- ఫోన్ పే వినియోగదారులు 08068727374 ద్వారా బ్లాక్ చేయాలి.
- పేటీఎం వినియోగదారులు 01204456456 ద్వారా బ్లాక్ చేయాలి.

అప్రమత్తంగా ఉండాలి...



ఫోన్ పోయిన వెంటనే యూపీఐ, డబ్బు లావాదేవీలు నిర్వహించే యాప్‌ల నుంచి లాగవుట్ అవ్వాలి. యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే పాస్‌వర్డ్‌ను కాంటాక్ట్ లిస్టులో సేవ్ చేసుకోకూడదు. ఒకవేళ యాప్‌ల నుంచి డబ్బులు బదిలీ చేసుకున్నట్లు గుర్తిస్తే వీలైనంత తొందరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– సార్ల రాజు, సీఐ కాజీపేట

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్‌గా ప్రదీప్‌రావు



నెక్ వరంగల్ జోనల్ నూతన కమిటీ

కాజీపేట అర్బన్: నెక్ వరంగల్ జోనల్ చైర్మన్‌గా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు 6వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని బీవీ రావు భవన్, నెక్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిటీని (ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలు) ఎన్నుకున్నారు. ఇందులో జోనల్ చైర్మన్‌గా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వైస్ చైర్మన్‌గా ఎం.నిశాంత్‌కుమార్, కోశాధికారిగా పరుచూరి కిరణ్‌కుమార్, మెంబర్లుగా త్రిపురనేని సుబ్రహ్మణ్యం, బొబ్బాల శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కాగా, తనపై నమ్మకంతో ఆరోసారి కూడా తనను జోనల్ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు సభ్యులకు ప్రదీప్‌రావు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా వరంగల్ లోకల్ చైర్మన్‌గా ఆవుల చంద్రయ్య, వైస్ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా కే.రాజేశ్వర్‌రావు, మెంబర్లుగా ప్రతాప్‌రెడ్డి, నిశాంత్ ఎన్నుకున్నారు. మార్తినేని ధర్మారావు, శ్యాంసుందర్‌రావు, రామారావు, మార్త రాంప్రసాద్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

- ప్రతీ ఇంట్లో క్షుణ్ణంగా తనిఖీ..
- రహమత్ నగర్ కాలనీలో పోలీసుల విస్తృత సోదాలు

కాజీపేట: కాజీపేట పట్టణం 61వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలో దారుణ హత్యకు గురైన కన్నె విజయ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సోమవారం సీఐ సార్ల రాజు తన సిబ్బందితో కలిసి కాలనీలోని పలు ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కాలనీకి సంబంధించిన వ్యక్తులే వృద్ధురాలిని హత్య చేసి ఉంటారనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రతీ ఇంట్లో విస్తృత సోదాలు చేశారు.

సాక్ష్యాధారాలు లభించకుండా నిందితుల జాగ్రత్తలు..

కర్రతో తలపై బలంగా కొట్టి హతమార్చిన నిందితులు పోలీసులకు ఎలాంటి సాక్ష్యాధారాలు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మృతురాలి శరీరంతో పాటు దుస్తులను సబ్బు నీళ్లతో కడిగి ఎలాంటి రక్తపు మరకలు లభించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిందితులకు ఎంతో ధైర్యం ఉంటే తప్ప ఈ దుశ్చర్య సాధ్యం కాదని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. నిందితులు ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలకు కూడా చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఆధారం లభించక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

కుటుంబీకులపై అనుమానం..

పోలీసులు మూడు రోజులుగా కాలనీలోనే మకాం వేసి విజయ హత్య కేసులో దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా బయటి వ్యక్తులతోపాటు కుటుంబీకుల ప్రవర్తనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. కుటుంబంలో వృద్ధురాలికి ఎవరితో నైనా అంతర్గత గొడవలు ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కుటుంబీకుల సెల్‌ఫోన్ కాల్ లిస్ట్ సేకరించి..వృద్ధురాలు మృతి చెందిన అనంతరం ఎవరెవరితో మాట్లాడారు? వారు ఎవరు అనే విషయాలను ఆరా తీస్తున్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు



అండర్-14 కేటగిరీలో తలపడుతున్న క్రీడాకారులు

హన్మకొండ: పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-14, 17 బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు సోమవారం హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో ఉత్సాహంగా కొనసాగాయి. సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నిర్వాహకులు బరువును తీసుకుని ఎంపిక పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 19న మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ బాధ్యులు తెలిపారు.

క్రీస్తు జననం ప్రపంచానికి పండుగ

- ఓరుగల్లు పీఠాధిపతి బిషప్ ఉడుములబాల



దివ్యాంగ పిల్లల మధ్య కేక్ కట్‌చేస్తున్న బిషప్ ఉడుముల బాల, ఇన్నారెడ్డి, విజయపాల్

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి పండుగ రోజు అని ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల అన్నారు. ఫాతిమానగర్‌లోని లోడి సాంఘిక సేవా సంస్థలో సోమవారం దివ్యాంగుల మధ్య ప్రీ క్రిస్మస్ సంబురాలు జరగాయి. ఈ వేడుకల్లో ఉడుముల బాల మాట్లాడుతూ దివ్యాంగ, హెచ్‌ఐవీ పిల్లల మధ్య క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పిల్లలకు క్రీస్తు దీవెనలు, ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని దీవించారు. లోడి సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు, హెచ్‌ఐవీ పిల్లల ఆరోగ్యం, చదువుపై అన్ని విషయాల్లో అండగా ఉండి వారి అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్ మండల పరుశరాములు మాట్లాడుతూ లోడి సేవా సంస్థ దివ్యాంగ, హెచ్‌ఐవీ పిల్లలకు చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం 600 మంది దివ్యాంగ పిల్లలకు కొత్త దుస్తులు, 150 మంది హెచ్‌ఐవీ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోడి సంస్థ నుంచి సిస్టర్ ధనియా, బాలశౌరి, కె.నాగేశ్వర్‌రావు, కె.మల్లేష్, పి.శౌరెడ్డి, ఎల్.వీరబాబు, బాజీ, డి.సామ్యూల్, టి.జయకిరణ్, జి.జోష్న, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- టేకులగూడెం క్రాస్ వద్ద ఘటన

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. మడికొండ పోలీసుల కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్ కొలుగురి చందర్ (28), అతడి స్నేహితుడు మహేందర్ ద్విచక్రవాహనంపై జనగామ నుంచి దేవన్నపేటకు వస్తున్నారు. ఈక్రమంలో టేకులగూడెం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో చందర్ అక్కడిక్కడే మృతి చెందగా మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో మహేందర్‌ను ఎంజీఎంకు తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరకాల శివారులో మరో యువకుడు..

పరకాల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన పరకాల పట్టణ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన కంచ కృష్ణ(25) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై పరకాల నుంచి నాగారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరకాల పట్టణ శివారు నాగారం రోడ్డు కొత్త గుడిసెల కాలనీ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడింది. దీంతో తీవ్రగాయాలపాలైన కృష్ణను బంధువులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి రవీందర్ ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ



గ్రీవెన్స్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

- అభివృద్ధి పనులు, అక్రమణలపై ఫిర్యాదు
- కిక్కిరిసిన గ్రేటర్ కౌన్సిల్ కార్యాలయం
- దరఖాస్తులను స్వీకరించిన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, అక్రమ, అనుమతి లేని భవన నిర్మాణాలు, స్థలాలపై గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు వెల్లువలా అందాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లోని గ్రీవెన్ సెల్‌లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా దరఖాస్తులను స్వీకరించారు. నిధులతో ముడిపడి ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు అందచేయాలని సూచించారు. ఇతర సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు, సిబ్బందిని ఆదేశించారు. స్థలాల ఆక్రమణలు, అనుమతి లేని భవన నిర్మాణాలను సాధ్య అసాధ్యాలను పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రీవెన్ సెల్‌కు మొత్తం 65 ఫిర్యాదులు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికే 33, ఇంజనీరింగ్ సెక్షన్‌కు 19, హెల్త్-శానిటేషన్ 5, ప్రాపర్టీ ట్యాక్స్ (రెవెన్యూ) 8 చొప్పన అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈ లు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేష్, సిటీప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్ కృష్ణా రెడ్డి, టీపీఆర్ఓ రాజేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల వివరాలు..

- 40వ డివిజన్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని, నిధులు మంజూరీ చేయాలని కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు.
- 3వ డివిజన్ ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ లే అవుట్‌లో తాగునీటి పైపులైన్లు మంజూరీ చేయాలని కాలనీవాసి రమేష్ దరఖాస్తు సమర్పించారు.
- 2వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ రోడ్డు, డ్రెయినేజీలకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు.
- 1వ డివిజన్ ఎర్రగట్టుగుట్ట పద్మావతినగర్ రోడ్డు-5లో అమృత్ పథకం నల్లా నీళ్లు రావడం లేదని చర్యలు చేపట్టాలని ,ఏడాదిన్నరగా ఫిర్యాదులు చేస్తున్నట్లు కాలనీ వాసులు విన్నవించారు.
- 57వ డివిజన్ అశోకాకాలనీ రోడ్డు నెంబరు 7లో డ్రెయినేజీ మురుగునీరు సక్రమంగా పోగా సమీప ఇళ్లలోకి వరద నీరు వస్తుందని చర్యలు చేపట్టాలని కోరారు.
- 1వ డివిజన్ ఎర్రగట్టు గుట్ట బాలాజీ నగర్‌లో డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు దరఖాస్తు అందజేశారు.
- బల్దియా పారిశుద్ధ్య విభాగంలో 90 శాతం మంది క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటారని, నవంబర్, డిసెంబర్ వేతనాలు ఈనెల 22 వరకు సీఐటీయు, టీఎమ్మార్పీఎస్ నాయకులు విన్నవించారు.
- కొంతమంది బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వైట్ కాలర్ కార్మికుల చేత ఇంటి, సొంత పనులు చేయించుకుంటున్న తీరుపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ధర్మరాజు విజ్ఞప్తి చేశారు.
- కరీమాబాద్ ఉర్సు 17-5-171 ఇంటికి సెప్టిక్ ట్యాంక్ లేకుండా నేరుగా డ్రైనేజీలోకి మల,మూత్ర వ్యర్థాలను వదిలేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- గవిచర్ల క్రాస్ రోడ్డు సాయినగర్‌లో 33-6-423 వద్ద నివాసాల మధ్య సిమెంట్ గోదాం ఉండడంతో భారీ వాహనాలతో స్థానికులకు ఇబ్బందులు పడుతున్నామని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- వరంగల్ డాక్టర్స్ కాలనీ స్నేహనగర్‌లో 8 రహదారులు దెబ్బతిన్నాయని, కొత్తగా రోడ్లు వేయించి, మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరారు.
- 47వ డివిజన్ బాపూజీ నగర్ డీజిల్ కాలనీ మసీదు వద్ద 25-8-526 ఆర్‌సీసీ కల్వర్టు నిర్మించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- హంటర్ రోడ్డు జూపార్కు నుంచి వెలువడుతున్న మురుగునీరు మళ్లింపు కోసం డ్రెయినేజీ నిర్మించాలని వరంగల్ పౌర స్పందన వేదిక కో-ఆర్డినేటర్ నల్లెల రాజయ్య విన్నవించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం: 15000/- మాత్రమే. సంప్ర॥ సంగీత - 9866943026. [W-1229340]

HOUSE FOR SALE

■వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-788969]

SERVICES

■వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్ సెల్: 8437924006. [W-788966]

BUSINESS OFFER

■ఉ॥ 6 గంటల నుండి మ॥ 12 గం॥ వరకు బైక్ ద్వారా గ్రామాల్లో తిరిగి శ్రీ విజయలక్ష్మీ వెజ్ & నాన్ వెజ్ పచ్చళ్లు అమ్మటం ద్వారా నెలకు 30 వేలు ఆపైన ఆదాయం వస్తుంది. బైక్ తప్పనిసరి. 8143909459. [W-1229341]

WANTED

■ Wanted door to door Marketing persons Male / Female No age or Education limit Freshers can apply. Cont: 7997777377. [W-788970]

■ హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ స్త్రీ/పు॥ సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. సాలరీ: 12000-16000. సంప్ర॥ 8688072125. [W-1220881]

■ Wanted Male Councillor for our overseas consultancy (Experience candidate will be preferred with attractive salary) Cont: 8106349938, 9849248509. [WA-13685]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-824667]

రాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ హన్మకొండలోని మా ఇంట్లో ఇంటి పని, వంట పని పనిచేయుటకు వంట మనుషులు భార్యభర్తలు /వంట మాస్టర్ పురుషులు కావలెను సంప్ర॥ సెల్: 9866012888. [W-1229334]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221891]

■ అల్వాల్‌లో చిన్న కుటుంబం కొరకు ఇంటి పని వంట పని చేయుటకు నమ్మకమైన ఆడ మనిషి కావలెను. భోజనం. 9100023171 [HA-95868]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.